
ఆహ్లాదం.. ఆనందం

- నందర్శకులతో పార్కుల కళకళ
- ఆట పరికరాల వద్ద పిల్లల సందడి



చిల్డ్రన్స్ పార్కు ముఖద్వారం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికే ఓ మణి హారం చిల్డ్రన్ పార్కు. విశాలంగా,పచ్చటి మొక్కలు,అందమైన విద్యుత్ కాంతుల నడుమ సందర్శకులకు కనువిందు చేస్తుంది. ఎంతటి ఒత్తిడితో ఉన్న వారైనా పార్కుకు వచ్చి ఓ పది నిమిషాలు వాకింగ్ చేసినా.. ఇక్కడ బల్లలపై కాసేపు సేద తీరినా ఎక్కడా లేనంత ఆనందం,ఆహ్లాదం మనసుకు కలుగుతుంది.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద సుమారు 75 సెంట్ల విస్తీర్ణంలో ఇటీవల చిల్డ్రన్ పార్కును జీవీఎంసీ అధికారులు నిర్మించారు. పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ పార్కు నిర్మాణం జరిగింది. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా రంగులరాట్నం,ఊయలలు,జారుడు బల్ల, స్ప్రింగ్ చైర్ ఇలా పలు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి ఉదయం 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.దీంతో చిన్నా పెద్దా అని తేడా లేకుండా అంతా పార్కులో ఉత్సాహంగా గడుపుతున్నారు.

లక్షలాది రూపాయలతో అభివృద్ధి

ఈ పార్కు నిర్మాణం కోసం హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ)సంస్థ రూ. 39 లక్షలు సీఎస్ఆర్ నిధుల నుంచి కేటాయించింది. జీవీఎంసీ నిధులు రూ. 19 లక్షలతో అభివృద్ధి చేశారు. పార్కు ఆవరణలో కడియం నుంచి 5 వేల వివిధ రకాల మొక్కలు తెచ్చి నాటారు. కాలనీ ప్రతినిధి బంగ్రారాజు పార్కు చొరవ తీసుకుని వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ దృష్టికి విషయం తీసుకెళ్లడంతో ఈ రోజు పార్కు ప్రగతి బాట పట్టింది.

భద్రతకు పెద్దపీట

చిల్డ్రన్ పార్కులో కాలనీ వాసుల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరో నెల రోజుల్లో పార్కు చుట్టూ ఓం కారం స్వరం వచ్చేలా స్పీకర్లు ఏర్పాటు చేయనున్నారు.ఇది పూర్తయితే పచ్చటి వాతావరణం నడుమ ఓం కారం ధ్వని ఆలకిస్తూ వాకింగ్ చేస్తుంటే ఆ అనుభూతి వర్ణణాతీతంగా ఉంటుందని సందర్శకులు చెబుతున్నారు..


పచ్చటి వాతావరణం నడుమ వాకింగ్ ట్రాక్


ఉయ్యాల ఊగుతూ ఆనందం వ్యక్తం చేస్తున్న చిన్నారులు


పచ్చటి మొక్కల మధ్య రంగుల రాట్నంపై ఆడుతున చిన్నారులు

రైల్వే నడక వంతెన కూల్చవద్దు

సీపీఎం డిమాండ్

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నడక వంతెనను రైల్వే అధికారులు కూల్చి వేసేందుకు యత్నించడం సమంజసం కాదని సీపీఎం నాయకులు అన్నారు. దీన్ని కూల్చవద్దని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ సభ్యులు ఎస్ విజయలక్ష్మి, బలివాడ వెంకటరావు డిమాడ్ చేశారు. ఈ మేరకు బుధవారం చంద్రనగర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడక వంతెన కూలిస్తే చంద్రనగర్ నుంచి గోపాలపట్నం రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతారని వాపోయారు. 30 ఏళ్లుగా ఈ నడక వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తుండగా ఇపుడు దీన్ని కూల్చి వేస్తామనడం చాలా దారుణమని వాపోయారు. కార్యక్రమంలో శంకరరావు, వెంకటరావు, జ్యోతీశ్వరరావు, వి. ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ జవహర్‌నగర్ ఫీడర్‌లో వార్షిక నిర్వహణ పనులు చేపట్టనున్న దృష్ట్యా ఆ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇందిరాకాలనీ-1,2 ప్రాంతాలు,బర్మాకాలనీ,వీటీ కాలేజ్ ఏరియా,జనతాకాలనీ,పవన్‌పుత్రకాలనీ,జవహర్‌నగర్ రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కళాకారులను ప్రోత్సహించండి


కోరమాండల్ అధికారికి వినతి పత్రం అందిస్తున్న మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు

మల్కాపురం: కళాకారులను ప్రోత్సహించే విధంగా చొరవ చూపాలని కోరమాండల్ సంస్థ యాజమాన్యానికి గాజువాక మూవీ ఆర్టిస్టల అసోసియేషన్ ప్రతినిధులు,సభ్యులు బుధవారం వినతి పత్రం అందజేశారు.సినీ కళాకారులమైన తమకు సరైన అవకాశాలు లభించక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని,తమ సంస్థ ద్వారా కళాకారులచే కార్యక్రమాలు నిర్వహించి ఆదుకోవాలని కోరారు. దీనిపై కోరమాండల్ అధికారులు సానుకూలంగా స్పదించారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.అధికారులను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు గుడివాడ శ్రీనివాసరావు,పైడిరాజు నూనెల, వెంకటేశ్వరరావు,అల్లు జోగినాయుడు,దుబాయ్ రాజు,శరత్,జ్యోతికుమారి,మంగ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యా కానుకలు


జ్యోతినగర్ స్టాక్ పాయింట్ నుంచి విద్యా కానుకలు తరలిస్తున్న ఎంఈవోలు, సిబ్బంది

కంచరపాలెం : గోపాలపట్నం మండల పరిధిలో పాఠశాలలకు 2024-25 విద్యా సంవత్సరానికి విద్యా కానుకలు మండల విద్యా శాఖాధికారులు-1,2 సోమేశ్వరరావు, దివాకర్ పర్యవేక్షణలో బుధవారం పంపిణీ చేశారు. మర్రిపాలెం పరిధి జ్యోతినగర్ ప్రాథమిక పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి పాఠ్య పుస్తకాలు, బ్యాగులను ఆయా పాఠశాలలకు తరలించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండల పరిధిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సిబ్బంది త్వరతగతిన స్టాక్ తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు లంక చైతన్య, పద్మ, లలిత, మంజుల, పీటీఐలు భవానీ, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు ఎంబీఏ విద్యార్థుల చేయూత


అనాథ బాలలకు సమకూర్చిన వస్తువులతో ఎంబీఏ విద్యార్థులు, తదితరులు

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన విద్యార్థులు సామాజిక సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. విద్యార్థులు విశాఖ పరిధిలోని 7 అనాథాశ్రమాలకు చెందిన 195 మంది బాలలను కళాశాలకు బుధవారం తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త తరుణ్‌కుమార్ మాట్లాడుతూ అనాథాశ్రమాల్లోని ఇబ్బందులను గుర్తించి వారికి సహకారం అందించేందుకు ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. వైద్య సేవలు అందించిన వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆశ్రమాల్లోని బాలలు ఆరోగ్యం, దంతాలను పరిరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తర్వాత బాలలకు వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూధనరావు మాట్లాడుతూ అనాథ బాలల కోసం 'కర్తవ్య' పేరుతో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆశ్రమాలకు కావల్సిన నిత్యావసర వస్తువులతోపాటు ఫ్యాన్లు, దుస్తులు, స్కూల్ బ్యాగ్‌లు, కిరాణా సామగ్రి, స్టేషనరీ అందించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతులు సన్యాసిరావు, బి.చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా యారాడ ఘాట్‌రోడ్ పనులు


యారాడ ఘాట్‌రోడ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: ఎన్నో ఏళ్లనాటి యారాడ ఘాట్‌రోడ్ సమస్య 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చొరవతో పరిష్కారమవుతుండడంతో అటు యారాడ గ్రామస్తులు, ఇటు పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.3.50 కోట్ల జీవీఎంసీ నిధులతో యారాడ ఘాట్‌రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు.

సుమారు రూ. కోటి 50 లక్షలతో రెండు కిలో మీటర్ల వరకు రోడ్డుకు ఇరువైపులా 2.5 వెడల్పున సీసీరోడ్లు నిర్మాణం, కోటి రూపాయలతో 3 కిలో మీటర్ల పొడవునా తారురోడ్డు, రూ.50 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు, రూ.50 లక్షలతో రిటైనింగ్‌వాల్స్, పెయింటింగ్ పనులు చేయనున్నట్టు చెప్పారు. మొత్తం పనులు ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

చదువుల ఒడికి..


గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం: వేసవి సెలవులు పూర్తయ్యాయి. పాఠశాలలు గురువారం నుంచి మళ్లీ తెరుచుకోనున్నాయి. విద్యార్థులతో కళకళలాడబోతున్నాయి. గోపాలపట్నం, ఎన్ఏడీ పరిసరాల్లో పలు పాఠశాలలు పునఃప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే పాఠశాలల్లో తరగతి గదులను ముస్తాబు చేశారు. టాయిలెట్లు శుభ్రం చేశారు. ఇక్కడి మేహాద్రి గెడ్డ దరి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను పరిశుభ్రంగా తయారు చేశారు. జీవీఎంసీ అధికారులు దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. జోనల్ కమిషనర్ హేమావతి ఆదేశాలతో ఫాగింగ్ పనులు చేపట్టారు.

పక్కాగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి


పుస్తకాలు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

ఆరిలోవ: చినగదిలి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్ట్‌లు, నోట్ పుస్తకాలు ఉన్న కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఎంఈవోలను ఆదేశించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాల కేంద్రాన్ని ఆయన విద్యా విభాగం అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. చినగదిలి మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఆయా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు వచ్చాయా? లేదా? తదితర వివరాల గురించి ఎంఈవోల ద్వారా తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇక్కడ కేంద్రంలో ఉన్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూలు కిట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పుస్తకాల కిట్లను జాగ్రత్తగా మండలంలో అన్ని పాఠశాలలకు పంపిణీ జరిగేటట్లు ఎంఈవోలు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. మండలంలో 72 పాఠశాలల్లో 13,148 మంది విద్యార్థులున్నారన్నారు. వారిలో ప్రస్తుతం 83 శాతం మందికి పాఠ్య పుస్తకాలు రాగా, 100 శాతం మందికి సరిపడా నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. షూలు 80 శాతం, బెల్టులు 55 శాతం మందికి సరిపడా వచ్చినట్లు తెలిపారు. ఇంకా యూనిఫారం రాలేదని, కొద్ది రోజుల్లో రానుందని, వచ్చిన వెంటనే సరఫరా చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ్య పుస్తకాల కిట్లు పంపిణీ రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన, ఎంఈవో-1 రవీంద్రబాబు, ఎంఈవో-2 అనురాధ, భవిత కోఆర్డినేటర్ గీత, పీఎంవో అప్పలనాయుడు, పీఆర్పీలు అప్పలరాజు, రాంబాబు, మండల కో-ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల జీతాలు చెల్లించాలి



దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు ఈ నెలలో అయినా సకాలంలో చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద దీక్షా శిబిరంలో బుధవారం ఆయన మాట్లాడారు. జీతాల చెల్లింపునకు యాజమాన్యం ఇచ్చిన మాటను ఈ సారైనా నిలబెట్టుకోవాలన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఉక్కు రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్ని హీనస్థితికి తీసుకెళ్లిందని ఆరోపించారు. ఈ దుస్థితికి కారణమైన ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, ఆంధ్ర రాష్ట్రానికి అతిపెద్ద దిక్కుగా ఉన్న ఉక్కు కర్మాగారానికి ఊపిరి పోసేందుకు సంకీర్ణ ప్రభుత్వ పెద్దలు కృషి చేయాలని కోరారు. దీక్షా శిబిరంలో ఎస్ఎంఎస్ - 2 విభాగ కార్మికులు, నాయకులు డి.ఆదినారాయణ, రమణమూర్తి, నరేంద్ర, భాస్కరమూర్తి, మాణిక్యాలరావు, మరిడయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

మరిడిమాంబ పండగకు వేళాయె

- నేడే ప్రధాన పండగ
- 1965లో కార్మికుల విరాళాలతో ఆలయ నిర్మాణం
- దేశ విదేశాల నుంచి హాజరు కానున్న భక్తులు


సర్వాంగ సుందరంగా ఆలయ ముఖ ద్వారం



ముస్తాబు అయిన ఆలయం (ఇన్‌సెట్) మరిడిమాంబ అమ్మవారి విగ్రహం


ఆలయంలో ప్రతిష్ఠించిన మహాశివుని విగ్రహం

సింథియా: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా సింథియా మరిడిమాంబ అమ్మవారికి ప్రతీతి. ఈ ఆలయానికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. నాటి నుంచి ఏటా అమ్మవారి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఈ ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గురువారం అమ్మవారి ప్రధాన పండగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర ఇదీ

దేశంలో మొట్టమొదటి నౌకా నిర్మాణ సంస్థ సింథియా నేవిగేషన్ కంపెనీగా పేరుగాంచిన నేటి హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ ముఖద్వారం ఎదుట అమ్మవారు వెలసిందని పూర్వీకుల విశ్వాసం. ఇప్పటి నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటీస్ స్కూల్ ప్రహరీని ఆనుకుని అమ్మవారి పుట్టమన్ను స్థలం ఉంది. అప్పట్లో రైలు మార్గం గుండా షిప్‌యార్డ్‌కు వచ్చే ఎగుమతి, దిగుమతులు, ఉత్పత్తులకు మొదట అమ్మవారి మందిరం వద్ద పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నాకే పనులు ప్రారంభించే వారని చెబుతుంటారు. రైలు మార్గం గుండా తరలివచ్చే కూరగాయలు, పలు రకాల ముడి సరుకులు నగరంలోని పాతపోస్టాఫీస్‌కు తరలించేందుకు దుర్గాబీచ్ నుంచి ఫెర్రీ(నీటిపై తేలియాడే తాళ్లతో కట్టిన కర్రల వంతెన) ద్వారా తరలించేవారు. అప్పట్లో సింథియా నేవిగేషన్ కంపెనీలో సుమారు 5వేల మంది కార్మికులు పని చేస్తుండేవారు. 1944లో ఆ ప్రాంతంలో అమ్మవారు తిరిగాడేవారని కార్మికులు అంటున్నారు. 1952లో ఓ రోజు రాత్రి వేళ భయంకరమైన ఉరుములు, మెరుపులతో పాటు పట్టీల శబ్దంతో అమ్మవారు కార్మికులకు కనిపించారని, ఆ తల్లి కోరిక మేరకు ఆ ప్రదేశంలో చిన్నపాటి పూరిపాకను నిర్మించి రాతినే అమ్మవారి ప్రతిరూపంగా నెలకొల్పినట్లు ప్రతీతి. అప్పటి షిప్‌యార్డ్ కార్మిక నాయకులు పిల్లా వీరన్న, శరగడం అప్పలనాయుడు, పిల్లా అప్పారావు, కిల్లాడ అప్పన్న తదితర కాలనీ పెద్దలు గుడి నిర్మాణానికి నాంది పలికారు. దీంతో అప్పటి షిప్‌యార్డ్ సీఎండీ కమోడోర్ లిల్లీ సహకారంతో అమ్మవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి కార్మికులంతా తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారని, 1965లో ఆలయ గోపురం, ముందుపెంకుతో మండపాన్ని నిర్మించారు. కాలనీ వ్యాపారులు గూడేల బాబూరావు, మిల్లు రంగబాబు వంటి వారే దేశ విదేశాల్లో స్థిరపడిన వారి కుటుంబ సభ్యులు అమ్మవారి ఉత్సవాలను ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరిపిస్తుంటారు. షిప్‌యార్డ్‌ను నౌకాదళ రక్షణ రంగంలో విలీనం చేయడంతో ఉద్యోగులు, కాలనీవాసుల సంఖ్య తగ్గిపోవడంతో కొన్నేళ్లుగా అమ్మవారి ఉత్సవాలను కాలనీ పూర్వీకులే నిర్వహిస్తున్నారు. ఆలయానికి ఎటువంటి ఆదాయం లేకపోయినా భక్తులు, కాలనీ పెద్దల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

సుదీర్ఘ చరిత్ర గల సింథియా మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి.

5న ఉత్సవ చాటింపుతో ప్రారంభమైన ఉత్సవాల్లో 6న పుట్ట బంగారం తీసుకువచ్చారు. ప్రతి రోజు అమ్మవారికి దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 13న గురువారం పండగ ముగింపులో భాగంగా ఆలయంలో అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం జాతర మహోత్సవాన్ని భారీ బాణసంచా నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే

సీతంపేట : ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్, స్వంతన సేవా సమితి సంయుక్తంగా ముద్రించిన ×బాలల హక్కులు.. చట్టాలు౯పుస్తకావిష్కరణ సభ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను సమస్యగా కాకుండా సవాలుగా చూడాలన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ

మహారాణిపేట: ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు కచ్చితంగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2016పై మాధవధారలో గల కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానా కట్టవలసి ఉంటుందన్నారు. తడి-చెత్త పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్ఆర్‌కే రావు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అదనపు ఎగ్జికూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీరామచంద్రమూర్తి, పోర్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీవీఎస్‌టీ మూర్తి, జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, జిందాల్ కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.సతీష్, అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

రామునాయుడుకి ఘన నివాళి

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు రామునాయుడుకి సీపీఎం మల్కాపురం జోన్ నాయకులు ఘన నివాళులర్పించారు. రామునాయుడు నివాసం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో మల్కాపురం సీపీఎం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీకి రామునాయుడు చేసిన సేవలను గుర్తు చేశారు.

విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ


మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట : సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ 'అనే అంశంపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ శ్రీశ్రీ అలుపు లేని అన్వేషి అని, వెనుదిరగని సాహసి అన్నారు. జనం జీవనాడి తెలుసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రయోగశాలిగా, పదునైన విమర్శకుడిగా శ్రీశ్రీ వినుతికెక్కాడని అన్నారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన ముందుగా ఇటీవల దివంగతులైన సహృదయ సాహితీ సభ్యుడు టీపీఎస్ ఆచార్యులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సి.హెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

దాబాగార్డెన్స్: అప్సాం గార్డెన్స్‌లో వెలసిన అనఘా లక్ష్మి, వారాహి సహిత రాజశ్యామల అమ్మవార్ల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ సాయిదర్బార్ ప్రాంగణంలో గల అమ్మవార్ల సన్నిధిలో ఆలయ అర్చకులు శైవాగమ రీతిలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, మహాలక్ష్మి హోమం జరిపారు. మహిళలు, భక్తులు సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణ చేశారు. అర్చకుల వేద పఠనంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద ఎత్తున స్థానికులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

తహసీల్దార్ వారి కార్యాలయం, గోపాలపట్నం

రిక.నెం.445/2024/ఎ/తేది.11-06-2024

పత్రికా ప్రకటన

గోపాలపట్నం మండలం, కప్పరాడ గ్రామ కాపురస్తులు శ్రీ కిల్లి శ్రీరామ మూర్తి, తండ్రి. లేటు కె. దాశయ్య, మాధవధార, గోపాలపట్నం, విశాఖపట్నం వారు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామము పేరు	సర్వే నెం.	విస్తీర్ణము
మాధవధార గ్రామం	సర్వే నెం.24/2బి భాగం మరియు సర్వే నెం.24/3సి భాగం	162 చదరపు గజములు

పైన తెలిపిన భూమికి 'నిరభ్యంతర ధృవీకరణ పత్రము' మంజూరు చేయుటకు ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా శ్రీ జాయింటు కలెక్టరు మరియు కాంపిటేంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహశీల్దార్, గోపాలపట్నం వారికి లిఖితపూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహసీల్దార్,
గోపాలపట్నం మండలం